గారి కోసం రాములవారి గుడికొచ్చే ఆ మహాతల్లె వరో?! ఈయనంటే మగాడు.. దానికేమొచ్చింది మాయరోగం? వాళ్లింట్లోవాళ్లు అసలు మనుషులేనా? చూస్తూ ఎలా ఊరుకుంటున్నారో! వెళ్లి తాడో, పేడో తేల్చండి. దాని కులమేంటో, గోత్రమేంటో?!'' అంటూ విరుచుకుపడింది.

''తెలుసుకొని ఏం చేద్దాం?''..

ప్రసాద్ అడ్డుకున్నాడు మధ్యలో.

''చేయడానికేముందీ.. పెళ్లి తప్ప!!''..

వ్యంగ్యంగా అన్నది.

''పెళ్లా..?'' విరగబడి నవ్వసాగాడు ప్రసాద్.

ఇక వినలేకపోయాను నేను.

''ఛీ..'' అంటూ విసురుగా నా గదిలోకి వచ్చేశాను.

* * *

''అసలేం జరిగిందో చెప్పు?'' నాలుగోసారి అడిగాను.

అయినా ఏడుపు మానలేదామె.

నాకర్థం కాలేదు. ఆరోజు మామూలుగా నాలుగింటికి రాములవారి గుడికొచ్చిన భవాని నన్ను చూడగానే బావురుమని ఏడ్చేసరికి కంగారుపడ్డాను.

''ఏమైంది? మీ ఇంట్లోవాళ్లేమైనా తిట్టారా?'' అనడిగాను.

చెప్పలేదు. ఎన్నిసార్లడిగినా ప్రయోజనం లేకపోవడంతో.. ఆమె ఏడుస్తున్నంతసేపూ అలాగే చూస్తూండిపోయాను. ఏడ్చీ ఏడ్చీ అలసిపోయి ఆపింది. అప్పుడు అడిగాను శాంతంగా..

''ఇప్పుడు చెప్పు!'' అని..

చెప్పడం మొదలుపెట్టింది.

అది వింటుంటే మా ఇంట్లో జరిగిన గొడవే గుర్తొచ్చింది నాకు.

''అసలు రేపట్నుంచి బయటికి కదలవద్దని చెప్పారు!'' చివరిగా జరిగిన తీర్మానమేమిటో కూడా చెప్పింది.

నవ్వొచ్చింది నాకు.

''మరి.. నువ్వేం అనుకుంటున్నావ్?'' అనడిగాను.

క్షణంపాటు అలాగే చూసింది నన్ను.

''అసలు ఏం చేయాలో, ఏం ఆలోచించాలో కూడా తెలియని అయోమయ స్థితిలో ఉన్నాన్నేను!'' అన్నది.

నేనేమీ మాట్లాడలేకపోయాను.

''ఏం చేయాలి?'' తనలో తాను అనుకుంటున్నట్లుగా అన్నది భవాని.

ఆలోచనలో పడ్డాను. ఏదో ఒకటి చేయక తప్పదు, ఉపేక్షిస్తే లాభం లేదు.

**ఒంటరిగా, నిర్లిప్తతతో బతికేసే మా జీవితాలు పరస్పరం దగ్గరై.. కష్టాలు, కన్నీళ్లు పంచుకోవడంలో, ఓదార్పు పొందడంలో కొత్త ఊపిరి పోసుకున్నట్లయింది. సమాజాన్నీ, కట్టుబాట్లనూ ఒకప్పుడు నేనూ నిప్పులా గౌరవించాను కానీ, ఆ గౌరవం నాకేది ఇప్పుడు? రవ్వంత మనశ్శాంతినైనా ఇవ్వని ఈ సమాజంతో నాకు పనిలేదు. అందుకే భవానిని తీసుకొని దూరంగా ఏ ప్రశాంత ప్రదేశానికో వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాను.**

''భవానీ.. నేను చెప్పినట్లు చేస్తావా?'' కాసేపటి తర్వాత అడిగాను.

''ఏమిటి?'' ప్రశ్నార్థకంగా చూసింది.

చెప్పాను.

అది వినగానే ఆమె ముఖంలో రంగులు మారాయి.

''అది తప్పు కదూ..'' అనడిగింది ఒకింత ఆందోళనగా.

''ఇంతకంటే మరో మార్గం లేదు!'' అన్నాను.

''కానీ..'' ఏదో చెప్పబోయింది.

''సరే.. నీ ఇష్టం!'' అని లేచాను గభాల్న.

ఆమె కూడా లేచింది.

''సరే.. వస్తాను!'' అనిచెప్పి, ఇంటికేసి బయల్దేరింది.

నేను కూడా ఆలోచిస్తూనే ఇంటిదారి పట్టాను.

ఇంటికెళ్లగానే మళ్లీ గొడవ మొదలైంది.

''మీ నిర్వాకం రోజురోజుకూ ఎక్కువవుతున్నది. బయట తలెత్తుకు తిరగలేక ఛస్తున్నాం! అసలేమిటి మీ ఉద్దేశం? మేమీ ఊళ్లో ఉండాలా? పోవాలా?'' అంటూ



ప్రసాద్ భార్య శాపనార్థాలు పెడుతున్నది.

''అక్కర్లేదు. రేపట్నుంచి మీకా బాధ లేదు..'' నిశ్చయంగా అన్నాను.

''ఏమిటి.. నువ్వేనా ఆ మాటలంటున్నది?''.. ప్రసాద్ గొంతులో అపనమ్మకం, అపహాస్యం కలగాపులగమైన భావం కనిపించింది.

''అవును.. నేను రేపే వెళ్లిపోతున్నాను!'' అన్నాను.

''ఎక్కడికి..?'' అర్థం కానట్లుగా అడిగాడు ప్రసాద్.

''ఇక వెనక్కి తిరిగిరాని చోటికి!''.

''అంటే..?'' అంటూ విస్మయంగా చూశాడు నావంక. కళ్లజోడు తీసి తుడుచుకుంటూ చెప్పాను..

''అంటే.. నువ్వర్థం చేసుకోలేవంటే నేన్నమ్మను. మళ్లీ ఇంటికి రాను, ఇంకెప్పుడూ నాకోసం ఎదురుచూడొద్దు!''.

''ఏమిటీ? లేచిపోతున్నారా?'' అన్నాడు వ్యంగ్యంగా.

''నువ్వేమనుకున్నా నాకభ్యంతరం లేదు''.

''అయితే.. నువ్వు చచ్చావనుకుంటాం!'' కోపంతో ఊగిపోతూ అన్నాడు.

''మంచిది..'' అనేసి, ఇక అక్కడ ఉండకుండా నా గదిలోకి వచ్చేశాను.

ఆ రాత్రంతా ఎడతెగని ఆలోచనలు..

ఎవరికి ఎవరమో తెలియని నాకు ఇక్కడ, భవానికి అక్కడ.. ఇంట్లో క్షణం కూడా మనశ్శాంతి లేని వేధింపులు, విశ్రాంతి లేని పనులు! అవమానాలూ, తిట్లూ!! వీటిని భరిస్తూ, సహిస్తూ ఇద్దరి మనసులూ బాగా చితికిపోయాయి. ఈ వ్యధలో, ఈ అలసటలో ఇద్దరం మానసికంగా చేరువయ్యాం.

ఒంటరిగా, నిర్లిప్తతతో బతికేసే మా జీవితాలు పరస్పరం దగ్గరై.. కష్టాలు, కన్నీళ్లు పంచుకోవడంలో, ఓదార్పు పొందడంలో కొత్త ఊపిరి పోసుకున్నట్లయింది. సమాజాన్నీ, కట్టుబాట్లనూ ఒకప్పుడు నేనూ నిప్పులా గౌరవించాను కానీ, ఆ గౌరవం నాకేది ఇప్పుడు? రవ్వంత మనశ్శాంతినైనా ఇవ్వని ఈ సమాజంతో నాకు పనిలేదు. అందుకే భవానిని తీసుకొని దూరంగా ఏ ప్రశాంత ప్రదేశానికో వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాను.

సమాజం దీన్ని స్వార్థం అనుకోనీ.. నీతి తప్పిన ప్రవర్తన అనుకోనీ! అలసిపోయాం.. వయసు జాలానికి బిగిసి అల్లాడిపోతున్నాం!

ఈ అలసట మాకే కాదు, పుట్టిన ప్రతివ్యక్తికీ ఉండేదే! అయితే అందరూ అజ్ఞాత మానసవాసంలో చిక్కుకొన్న దురదృష్టవంతులు! కొందరు మాత్రమే మనశ్శాంతిని సాధించుకునే అదృష్టవంతులు!

శరణం మిథ్య.. పయనం సయోధ్య!

ఆదిలో ఒంటరిగా ఉన్న తృష్ణ.. అంతంలో కూడా వల్మీకంగా మిగిలిపోదు.

ప్రపంచం ఒంటరిగా మొదలు కాలేదు. 'తోడు'తోనే విజయాల్నీ, అపజయాల్నీ చవిచూస్తున్నది.

మా గమనం కూడా అంతే!

..ఈ సత్యం తెలియగానే నా హృదయం తేలికైంది.

భర్త చనిపోయిన యాభై ఆరేళ్ల భవానికి, అరవై యేళ్ల నాకు.. కొడుకూ, కోడళ్ల వేధింపులు! వయసుడిగిపోయి ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో క్షణం కూడా విశ్రాంతి లేని పనులు.. మనశ్శాంతి లేని అవమానాలు! వాటికిక నేటితో ముగింపు పలకబోతున్నాం. నాకు తెలుసు.. రేపటి మా 'పయనం' ఈ సమాజం దృష్టిలో 'లేచిపోయిన వృద్ధజంట'గా మిగిలిపోతుందని!

మనసులోనే నవ్వుకున్నాను. ■

## ఎస్వీకే సంహితానాయుడు



సాహిత్య నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన యువ రచయిత్రి, కవయిత్రి ఎస్వీకే సంహితానాయుడు. బాల్యం నుంచే తెలుగుసాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్నారు. 5వ తరగతి నుంచే చిన్నచిన్న కవితలు, చిట్టిపొట్టి కథలు రాస్తూ.. రచనా వ్యాసంగాన్ని మెరుగుపరచుకుంటూ వస్తున్నారు. స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం బీఎస్సీ చదువుతున్నారు. ఇప్పటివరకూ 20 కథలు, 20 కవితలు, 20 సినిమా సమీక్షలు, 8 వ్యాసాలు (జాతీయ అంశాలపై)లతోపాటు ఇతర రచనలు చేశారు. 'నది' మాసపత్రిక నిర్వహించిన కథల పోటీల్లో.. పెళ్లిచూపులు, అత్తగారి కొత్తకోడలు కథలు ఎంపికయ్యాయి. 'సాంస్కృతిక వేదిక', 'సారంగ' (అంతర్జాల పత్రిక) – 'టాల్' (రేడియో) నిర్వహించిన కథల పోటీల్లో 'అద్దదీ సంగతి' కథ, 'మనిషితనం' కథలు బహుమతులు గెలుచుకున్నాయి. వీటితోపాటు మబ్బులు తొలగిన ఆకాశం, హాఫ్ బౌ, పి.ఎస్.ఎఫ్.స్ట్రోక్, మనిషికి మనిషి, ముఖపుస్తక మాయాజాలం కథలకు బహుమతులు అందుకున్నారు.